క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



నారాయణ పేటరూరల్/టౌన్: మండల పరిధిలోని అప్పక్ పల్లి వద్ద ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మంగళవారం విన్నవించారు. కొటకొండ నుంచి అప్పక్‌పల్లి వరకు చేపట్టిన బీటీరోడ్డు పనులను కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిలిపి వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని కలెక్టర్‌కు విన్నివించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, కొటకొండ మాజీ సర్పంచ్ జయలక్ష్మి, సునిత, నారాయణ, నాయకులు నర్సింహులు,భీమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై..

నారాయణ పేట టౌన్/కొత్తపల్లి: కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో శ్రీ గురులోక మసంద్ బావోజీ జాతరకు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు ధర్మకర్తలు మంగళవారం విన్నవించారు. ఏప్రిల్ 4నుంచి 15వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతి ఇతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించాలని కోరారు.

అల్పాహారం కోసం దాత విరాళం



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ ఉన్నత పాఠశాలలో ఉదయం పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం మంగళవారం బీఆర్ఎస్ నాయకులు హన్మిరెడ్డి రూ. 10వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం అందించడం కోసం దాతలు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, రమేష్, నాయకులు రాఘవేందర్, జగదీష్, రామలింగంగౌడ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో శివ స్వాములు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి సింధురంతో అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదానం నిర్వహించారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



మాగనూర్: మండలంలోని మందిపల్లి గ్రామానికి చెందిన అనురాధకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది గర్భిణిని ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది అత్యవసర వైద్య సూచనలు పాటిస్తూ అంబులెన్స్‌లోనే సాధారణ కాన్పు చేశారు. అనంతరం మాగనూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డలు క్షేమమని తెలిపారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి అభినందించారు.

తల్లిదండ్రులకు పాదపూజ



ఊట్కూరు: మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవని చిన్నప్పటి నుంచి విద్యార్థులకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రోశనప్ప, జగన్నాథ్‌రావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



నర్వలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కురుమయ్య



కోస్గిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బాల్‌రాజ్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మరికల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

మరికల్: సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాము అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రత నిబంధనలు, మహిళల రక్షణ చట్టాల గురించి షీటీం ద్వారా అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, వేదింపులకు గురిచేస్తే 100కు ఫోన్ చేయాలని తెలిపారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో..

నర్వ: విద్యార్థులు సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. మంగళవారం పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్‌లు వాహనాలు నడిపినా, తల్లిదండ్రులు ఇచ్చిన చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఎవరైనా విద్యార్థినులను వేదింపులకు పాల్పడిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు సదన్‌రావు, గ్రామస్తులు మహేష్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

కోస్గిరూరల్: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వాహనాలు నడపొద్దని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడపొద్దని, పట్టుబడితే చట్టరిత్యా చర్యలు తప్పవన్నారు. పోలీస్ సిబ్బంది ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



నర్వ ఎమ్మార్సీలో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ



గుడెబల్లూర్‌లో విద్యార్థులకు సూచనలు అందిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

నర్వ: విద్యార్థులకు బోధన పద్ధతులను సులభంగా త్వరగా అర్థమయ్యేటట్లు బోధించాలని ఏఎంఈఓ విద్యాసాగర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం నరేష్‌కు సూచించారు.

పకడ్బందీగా చేపట్టేలా..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఆపార్ ఐడీని తప్పనిసరి జెనరేట్ చేయాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. ఎమ్మార్సీలోని ఆయా పాఠశాలల హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆదేశాల మేరకు వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు భాగ్యలక్ష్మి, హెచ్ఎంలు రాంరెడ్డి, వెంకటేష్, శిరీష, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో..

కృష్ణా: పదోతరగతి విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు గాను తమ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ నిజాముద్దీన్ పరీక్షల ఇన్‌చార్జి గణేష్‌సింగ్‌కు సూచించారు. మంగళవారం మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు అవసరమయ్యే ప్రేరణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సంతోషి, కిషోర్, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

నారాయణపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ అచ్చంపేట కార్యాలయంలో కార్యదర్శి సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు, సిబ్బంది

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్దూరు: కంది కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గూళ్ల నర్సింహులు, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐబీ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, వెంకటయ్య, యాసీన్, రాఘవ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి..

మరికల్: మండలంలోని కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని బీఆర్ఎస్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు రాయిచూర్, నారాయణపేట మార్కెట్‌కు వెళ్లి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి ధన్వాడ, మరికల్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు



మద్దూరు: మద్దూరు మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. మంగళవారం మున్సిపల్ శాఖ అధికారులు మద్దూరు, రెనివట్లలో సందర్శించి ఆయా గ్రామాల రికార్డులను పరిశీలించారు. కమిషనర్ నాగరాజు, మేనేజర్ యాదయ్య, టీపీఓ కిరణ్, ఏఈ నాగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



ధన్వాడ: మండల కేంద్రంలోని నర్సరీలను డీఆర్‌డీఓ మొగులప్ప మంగళవారం పరిశీలించారు. ప్రతి రోజూ మొక్కలకు నీరు పోయాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ సాయిప్రకాష్, ఏపీఓ సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మరికల్: రైతుల ఖాతాలో యాసంగికి సంబంధించిన రైతు భరోసా డబ్బులు జమ చేయడంతో మంగళవారం మండలంలోని ఇందిరగాంధీ చౌరస్తాలో రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, కృష్ణయ్య, రామన్‌గౌడ్, హరీష్, రామకృష్ణ, రామకృష్ణరెడ్డి, గోపాల్, ఆంజనేయులు, రాములు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవిసత్యారంలో..

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యారంలో రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ కావడంతో రైతులతోపాటు కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రైతులు నాగేష్, చిన్నరాము, హరీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్, తిమ్మప్ప, ఆంజనేయులు, శివరాజ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ సర్టిఫికెట్ల పంపిణీ



నారాయణ పేట ఎడ్యుకేషన్: స్థానిక మాడర్న్ హైస్కూల్‌లో నూర్జహన్, అబ్దుల్ హాఫిజ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అంతేకాక మిలాద్ మాసంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

మద్దూరు: దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అందేలా అన్నిశాఖల అధికారులు చొరవ చూపాలని కమిట్‌మెంట్ ఈడీ జాన్సి కోరారు. మంగళవారం మండల సమైఖ్య భవనంలో అన్ని శాఖల అధికారులు దివ్యాంగుల సంఘాల లీడర్లతో వీరి అభ్యున్నతికి అవగాహన నిర్వహించారు. దివ్యాంగులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎస్ఐ రాంలాల్, ఏపీఎం నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధశాఖల అధికారులు

నేడు ఎమ్మెల్యే రాక

మాగనూర్: ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొంటారని, విద్యార్థులు ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాలన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు

మరికల్: మండలంలోని యువక మండలి భవన ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు యశ్వంత్, రాహుల్ కంటి సమస్యతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ నిమిత్తం మహబూబ్‌నగర్‌కు రేఫర్ చేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, బసంత్, రామన్‌గౌడ్, హరీష్, వీరన్న, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

కోస్గి రూరల్: అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని ఉదయం 10గంటలకు నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పనిభారం తగ్గించాలి..

మాగనూర్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో సర్వేను వందశాతం పూర్తిచేశామని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు.. తమపై పనిభారం తగ్గించాలని.. కోరుతూ.. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు గౌడ్

నారాయణపేట రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచి అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మ్యానిఫెస్టో, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కో శాధికారి రంగప్ప యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు, రాజశేఖర్, సత్యనారాయణ, వెంకటన్న, వీరేష్, రాములు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మక్తల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాలకు మరుగుదొడ్లు లేకపోవడం దారుణమని అన్నారు. ఎమ్మెల్యే తక్షణమే దృష్టిసారించి మరుగుదొడ్లు, ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శివలిలా, కల్పన, అనిత, అనుష, పుష్పలత, సునీత, భువనేశ్వరి, అరవింద్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

మక్తల్: బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించొద్దని, బాలకార్మికులను పనిలో పెట్టుకొవద్దని జిల్లా సమన్వయకర్త నర్సింహులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలలహక్కులపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలులోపు అమ్మాయిలు, 21సంవత్సరాలకు అబ్బాయిలు వివాహం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఆడ్వైజర్ కవిత, జిల్లా అధికారి తిరుపతయ్య, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 29నుంచి 31తేదీ వరకు మెదక్ జిల్లా తూప్రాన్ ఒలంపిక్ ఇంటర్‌నేషనల్ పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా సాఫ్ట్ బాల్ 14సంవత్సరాలోపు బాల బాలికల పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు తరుపున పాల్గొనేందుకు సైదులు, కార్తీక్, అభిరాం, వెంకటేష్ ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఎంపికల పట్ల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్, పీడీ డాక్టర్ రామ్మోహన్, పీఈటీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ సేవకుడికి సన్మానం

నర్వ: మండలంలో ఉత్తమ సేవలకుగాను ఎంపీడీఓ శ్రీనివాసులుకు కలెక్టర్ ద్వారా గుర్తింపు లభించిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎంపీడీఓను శాలువాతో సత్కరించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు అయ్యప్ప, డా శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, అయ్యన్న, గోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ పత్రాల అందజేత

కోస్గి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను అందజేసినట్లు ఏఓ రేష్మారెడ్డి, మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మంగళవారం గుండుమాల్ మండలంలోని ముదిరెడ్డిపల్లిలో దాదాపు 468మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. కార్యాక్రమంలో కార్యదర్శి సత్తయ్య, ఏఈఓ తిరుపతి, నరేందర్, హర్షవర్ధన్, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

ధన్వాడ: వచ్చేనెల 4, 5వ తేదీలలో భద్రాచలంలోని బత్తుల నగర్‌లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు మహేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, పరశురాం, సంతోష్, ప్రవీణ్, రమేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నిందితుడి రిమాండ్: కేసు నమోదు

దామరగిద్ద: కుటుంబ సభ్యులపైదాడి కేసులో వ్యక్తిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. వివరాలిలా.. భూవివాదంలో మాట మాట పెరిగి పెద్దకుమారుడు బసిరెడ్డి, తన కిష్టమ్మ, తమ్ముడు నారాయణరెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

నారాయణ పేట టౌన్: హిందువులు ఆరాధ్య దైవంగా పూజించే శ్రీ సరస్వతీ మాతను కించ పరిచేలా. మాట్లాడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు మంగళవారం ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ కడుదాస్, కన్న శివకుమార్, మదన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మద్దూరులో సరస్వతీమాతను కించపరిచేలా మాట్లాడినవారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎస్ఐ కృష్ణంరాజుకు అఖిలభారత అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సరస్వతీమాత చిత్రపటానికి పూజలుచేసి జెండా ఆవిష్కరించడంపై కొందరు అసభ్యకరంగా మాట్లాడటంతో వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భానుప్రకాష్, రమేష్, రణవీర్, హరిహర పాల్గొన్నారు.

